క్లుప్తంగా

పాఠశాల తనిఖీ చేసిన ఎంపీడీఓ



మక్తల్: మండలం సోమేశ్వర్‌బండలో ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా ఎంపీడీఓ రమేష్ తనిఖీ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, రికార్డులు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పరిశుభ్రత ఎలా ఉందని వీధుల్లో వెళ్లి పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం శ్రీకాంత్, ఉపాధ్యాయుడు ప్రసాద్ ఉన్నారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

మరికల్: నియోజకవర్గ స్థాయిలోని వివిధ శాఖల అధికారులతో గురువారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మరికల్‌లో సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీఓ కొండన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని సూర్యచంద్ర కన్వెన్షన్ హాల్లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం, అనంతరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై చర్చిస్తారని తెలిపారు.అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

అందుబాటులో వేరుశనగ విత్తనాలు

మద్దూరు: ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రాథమిక సహకార సంఘం దమ్‌గాన్‌పూర్(పీఏసీఎస్)లో కే 6 రకం వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు సంఘం చైర్మన్ నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కేజీ బస్తా ఒక్కటి రూ. 3,046. 55 పైసలు. దాదాపు 60 బస్తాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అవసరమైన రైతులు తమ పాసుపుస్తకాలను తీసుకొచ్చి పీఏసీఎస్ కార్యదర్శి భాస్కర్‌ను సంప్రదించాలని సూచించారు.

కర పత్రాలు విడుదల

మరికల్: జిల్లా కేంద్రంలో నిర్వహించే సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సు సందర్భంగా బుధవారం మరికల్ తహసీల్దార్ జమీల్ సమాచార హక్కు చట్టం కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈ నెల 30న నిర్వహించే సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ అవగాహన సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సందకృష్ణ, వెంకటేష్ యాదవ్, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

విద్యార్థి గర్జన సభ జయప్రదం చేద్దాం

నారాయణపేట రూరల్: భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27న హైదరాబాద్‌లో నిర్వహించే విద్యార్థి గర్జన సభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరహరి కోరారు. జిల్లా కేంద్రంలోని బీసీ బాయ్స్ హాస్టల్ దగ్గర బుధవారం కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కన్వీనర్ పవన్, నాయకులు నరేష్, భాను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

నారాయణపేట రూరల్: బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాంఘిక సంక్షేమ గురుకుల పార్ట్ టైం టీచర్లు నిరసన వ్యక్తం చేశారు. సింగారం సమీపంలోని గురుకుల పాఠశాలలో టీచర్లు నల్ల బ్యాడ్జీలతో ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు, ప్రిన్సిపల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బళ్లారి వెంకటేష్ మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, జిల్లాలో 120 మంది టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కొల్లంపల్లిలో పోషణ్ అభియాన్



నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లిలో బుధవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి గోపాల్, పంచాయతీ సెక్రటరీ ఖాదర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరోజ, జీహెచ్‌ఎం అనురాధ, భీమేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, చెన్నమ్మ, అనిత, శశికళ, వనమాల, సుజాత, మంజుల, అలివేలు, గంగాదేవి, అనంతమ్మ పాల్గొన్నారు.

నిఘా నేత్రాలపై నిర్లక్ష్యం

- గ్రామాల్లో సీసీ కెమెరాల నిర్వహణ అస్తవ్యస్తం
- రూ.వేలు ఖర్చు చేసినా నిరుపయోగం
- పటించుకోని అధికారులు



ధన్వాడలో పనిచేయని సీసీ కెమెరాలు

మరమ్మతు చేయాలి..



ధన్వాడ మండల కేంద్రంలో సీసీ కెమెరాలు పని చేయక పోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు, చోరీలు జరిగినప్పుడు ఇబ్బందులు పడుతున్నాం. మండలానికి చాలా మంది వస్తూ, వెళ్తుంటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కెమెరాలకు మరమ్మతు చేయించాలి.

– ఓం భగవత్, ధన్వాడ

ధన్వాడ: ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నిరంతరం నిఘా ఉంటుందని, దొంగతనాలు అరికట్టేందుకు దోహద పడతాయని ప్రజలకు అవగాహన కల్పించి పోలీసులు ఏర్పాటు చేయించారు. వాటి కోసం గ్రామాల్లో డబ్బులు జమ చేసి దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. కొన్ని గ్రామాల్లో ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేశాయి. వాటిని ఏర్పాటు చేసుకున్నప్పటికీ నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో మూలన పడ్డాయి. దీంతో బైక్‌లు చోరీ, దొంగతనాలు, గొడవలు, ఇతర సంఘటనలు చోటు చేసుకోవడంతో వాటిని ఛేదించడంలో పోలీసులకు సవాలుగా మారింది.

దాతల సహకారంతో..

రూ.లక్షలు వెచ్చించి గ్రామాలు, మండల కేంద్రంలో ప్రజా ప్రతినిధులు, దాతలు విరాళాలు అందించడంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అనంతరం వాటి నిర్వహణ లేక మరుగున పడ్డాయి. ధన్వాడ మండల కేంద్రంలో సోలార్ కంపెనీ వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటికి సంబంధించిన సర్వర్లు, మానిటర్లు, పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. కేబుల్ వైర్స్ తెగిపోయి సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఒకటి, రెండు సార్లు పోలీస్ వారు రిపేర్లు చేసినా, తరువాత వాటిని పట్టించుకోవడం లేదు. సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ప్రధాన కూడలిలో జరిగే ప్రమాదాల వాహనాలు గుర్తించలేక పోతున్నారు. వాహనాలు గుర్తించేందుకు పెట్రోల్ బంక్ సీసీ కెమెరాలపై అధారపడుతున్నారు. గత నెల బీసీ కాలనీలో రెండు రోడ్డు ప్రమాదాల వల్ల ఇద్దరు మృతి చెందారు. అక్కడే సీసీ కెమెరా ఉన్నా అది పనిచేయలేదు. దీంతో మరికల్ దగ్గరలో ఉన్న పెట్రోల్ బంక్ సీసీ కెమెరాలో పరిశీలించి వాహనం పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఆ లోపే వాహనం హైదరాబాద్ టోల్‌గేట్ వరకు వెళ్లిపోయింది. అక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఢీ కొట్టిన వాహనం పట్టుకున్నారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

మూడు నెలలకే..

రామకిష్టాయిపల్లి గ్రామంలో మూడు నెలల క్రితం సీసీ కెమెరాల కోసం ఎంపీ నిధులు రూ.5 లక్షల కేటాయించారు. మూడు నెలలకే ఆ సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఈ విషయం సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసినా స్పందించడం లేదని పంచాయతీ సిబ్బంది పేర్కొన్నారు.

జ్యోతిరావు పూలే స్ఫూర్తితో పోరాడుదాం



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం కృష్ణ

నారాయణపేట: సమాజంలో మనుషులందరూ సమానంగా జీవించాలని జ్యోతిరావు పూలే స్ఫూర్తితో కుల నిర్మూలన కోసం పోరాడుదామని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం కృష్ణ, జిల్లా కార్యదర్శి బి.రాము అన్నారు. జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ స్థాపన 151వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ భవన్‌లో ఆ పార్టీ ఆధ్వర్యంలో 'కుల నిర్మూలన సదస్సు' నిర్వహించారు. వృత్తుల ఆధారంగా కులాన్ని ఏర్పాటు చేశారన్నారు. కుల నిర్మూలన పోరాటంలో కార్మికులు, కర్షకులు, యువకులు, విద్యార్థులు, మహిళలు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. అంటరానితనం, రెండు గ్లాసుల పద్ధతి లేకుండా చేయాలన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, నాయకులు బీ యాదగిరి, జయలక్ష్మి, నరసింహ, ప్రశాంత్, బాలకృష్ణ, నారాయణ, హాజీ మలాంగ్, నరసింహ, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి సౌజన్య, సునీత, మంజుల, సత్యమ్మ, జయ పాల్గొన్నారు.

ఊట్కూరు: మహాత్మాజ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోదక్ సేవా సమితి 152వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని బిజ్వార్ స్థానిక భవనంలో జరిగిన సమావేశంలో సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు ఎం కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో సలీం, గోవిందు, గోవర్దన్ రెడ్డి, తిరుపతి, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలో పట్టుబడిన నిషేధిత గుట్కాలు


దామరగిద్ద: మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో నిషేధిత గుట్కా ప్యాకెట్లు పట్టుబడిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏఎస్ఐ అరుణ్ సమక్షంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై నారాయణపేట నుంచి మద్దూర్ వెళ్తున్న అబ్దుల్ బారి దగ్గర నిషేధిత గుట్కాలు గుర్తించి పట్టుకున్నారు. రూ.7870 గుట్కా ప్యాకెట్లను సీజ్ చేసి నిందితుడు అబ్దుల్ బారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పిల్లలకు ఆరోగ్య పరీక్షలు



మరికల్: మండల కేంద్రంలోని యువక మండలి భవనంలో బుధవారం ఐసీడీసీ, పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బరువు తక్కువ ఉన్న పిల్లలకు డాక్టర్ కిరిటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. చిన్న వయస్సు పిల్లలకు ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహేశ్వరి, సువర్ణ, గీత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులను సైన్స్ వైపు ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్ఓ

నారాయణపేట రూరల్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను సైన్స్ వైపు ప్రోత్సహించాలని డీఎస్ఓ భానుప్రకాష్ అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రైవేట్ స్కూల్ ఫిజిక్స్, బయోసైన్స్ టీచర్లకు ఇన్‌స్పైర్ అవార్డుల నామినేషన్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఓ మాట్లాడుతూ పిల్లల్లో దాగిఉన్న సృజనాత్మకతను బయటకు తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. చిన్నారుల్లోని ఆలోచనకు ఆచరణ రూపం ఇచ్చే విధంగా ఉపాధ్యాయులు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్నారు. ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులను చేయించే విధంగా చూడాలని, అక్టోబర్ 15 లోపు యాప్, వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల వ్యక్తిగత ఖాతాలో రూ.10వేలు జమ చేస్తారని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ, సీఎంఓ రాజేందర్, జీహెచ్‌ఎం వేణుగోపాల్, టీచర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు 'మహాలక్ష్మి' ప్రొసీడింగ్స్ పంపిణీ

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం, అవుసలోనిపల్లి గ్రామాల్లో బుధవారం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్స్ లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వీరరాఘవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకు గ్యాస్ సిలిండర్లను అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు విజయ్‌సింహారెడ్డి, సాయిల్‌గౌడ్, కతలప్ప, డీలర్ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు కనకప్ప, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయులకు సన్మానం



మద్దూరులో సన్మానిస్తున్న తపస్ నాయకులు

మద్దూరు: మద్దూరు, కొత్తపల్లి నూతన ఎంఈఓలుగా బాలకిష్టప్ప, ఆంజనేయులును నియమించడంతో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు.

కృష్ణా: మండల విద్యాధికారిగా ముడుమాల్ హెచ్‌ఎం నిజాముద్దీన్ ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, వివిధ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేసి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ వెనుకబడిన కృష్ణా మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని, మూతపడ్డ పాఠశాలలను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, నర్సప్ప, అల్లంపల్లి ఎంకప్పగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, దండు శేఖర్ పాల్గొన్నారు.

మాగనూర్: మాగనూర్ ఎంఈఓగా నియమితులైన మురళీధర్‌రెడ్డిని మండల పీఆర్‌టీయూ–టీఎస్ సంఘం నాయకులు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ–టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు తిరుపతి, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బలరాం, తిమ్మన్న, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు దేవిన్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ అధ్యక్షుడికి..

కృష్ణా: మండలంలోని ముడుమాల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి శేఖర్ ఇటీవల పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో గ్రామ నాయకులు, ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయులకు..

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు నర్సింహ, కృష్ణమ్మ, భాస్కర్, శ్రీధర్‌లను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవిందర్‌రెడ్డి, ఏఎంఓ రామచంద్రాచారి, పాఠశాల చైర్మన్ భీమమ్మ, లలిత, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, జగన్నాథ్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన


మరికల్: మండలంలోని వివిధ పాఠశాల విద్యార్థులకు బుధవారం మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ మెడికల్ కళాశాలలో మానవ శరీర భాగాలపై వైద్య బృందం అవగాహన కల్పించారు. ప్రతిభ, భారతి ఉన్నత పాఠశాల విద్యార్థులను అక్కడికి తీసుకెళ్లి గుండె, రక్తనాళాలు, మూత్ర పిండలు, ఊపిరితిత్తులు, జీర్ణప్రక్రియ, కాలేయం, ఎముకలు, జీవ క్రియల పనితీరుతో పాటు వివిధ శరీర భాగాలపై అక్కడి వైద్యుల ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కరస్పాడెంట్లు హన్మంతురెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు



ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి 68 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన అండర్-14, 17 బాలికలకు క్రీడాపోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. నేడు బాలురకు పోటీలు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం నరసింహచారి తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధికారి సాయి ప్రకాష్, ఎంఈఓ గాయత్రి, పీటీ రాంమోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి ఆహ్వానం



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మక్తల్: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మక్తల్ కరాటే బూడోకాన్ వ్యవస్థాపకుడు సాలా బిన్ ఉమర్ సలాం శాలువాతో సత్కరించారు. వచ్చే నెల 17న మక్తల్లో అతిపెద్ద కరాటే టెస్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో కరాటే అడ్వైజర్ మల్లికార్జున్‌గౌడ్, అంజన్‌ప్రసాద్, విజయ కృష్ణ, ఎండీ సలీం, మాస్టరులు పాల్గొన్నారు.

మార్కెట్ డైరెక్టర్‌కు..

మరికల్: మండలంలోని పూసల్‌పహాడ్ గ్రామానికి చెందిన రాజారెడ్డి నారాయణపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నిక కావడంతో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మానించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్‌ను ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రాజు, మొగులప్ప, జయసింహారెడ్డి, అంజిరెడ్డి, గొల్ల ఆంజనేయులు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



హిందుపూర్‌లో పాల్గొన్న ఎంపీడీఓ జానయ్య



రాకొండలో శుభ్రం చేస్తున్న ఆశ, అంగన్‌వాడీలు

కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో బుధవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జానయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛత పాటించాలని, ప్రతి గ్రామంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటూ వీధులను శుభ్రపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని రాకొండలో ఎంపీడీఓ కొండన్న పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని ఎస్సీ వాడీ, వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సాయి ప్రకాష్ మాట్లాడారు.

29న ఉచిత మెగా వైద్యశిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న లయన్ సభ్యులు

నారాయణపేట రూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 29 పట్టణంలోని శ్రీరాఘవేంద్ర గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన స్పెషలిస్టుల పర్యవేక్షణలో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. జనరల్ మెడిసిన్, స్త్రీ సంబంధిత వ్యాధులు, కంటి వ్యాధులు అత్యవసర వైద్య సేవలు, చిన్నపిల్లలకు సంబంధించిన వ్యాధులు, ఎముకలు, చర్మ వ్యాధులు, చెవి ముక్కు వ్యాధులకు ఉచితంగా ల్యాబ్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి బాలాజీ కాంబ్లె, రవిగౌడ్, మోల్గన్ జనార్దన్, డాక్టర్ సచిన్ మంగిలి, క్యాతన్ గోవర్ధన్, సదానంద్ చారి, సురేందర్ చారి పాల్గొన్నారు.

సమస్యలపై తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పూర్వ వీఆర్‌ఏలు

కృష్ణా: గ్రామ రెవెన్యూ సహాయకులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసీల్దార్ దయాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం నాయకుడు మచ్చేందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామ సహాయకులను సర్దుబాటు చేసేందుకు 81,85,98 జీఓల ప్రకారం ప్రమోషన్ పొందిన వీఆర్‌ఏలు తక్కువ సర్వీస్‌తో రిటైర్‌మెంట్ అవుతున్నారన్నారు. రిటైర్డు అయిన వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి చేకూరడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

పీఆర్టీయూ తెలంగాణ కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న సంఘం నాయకులు

మాగనూర్: మండల నూతన పీఆర్టీయూ తెలంగాణ సంఘం నూతన కమిటీని బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి నల్గొండ మహేష్, స్టేట్ అసోసియేట్ అధ్యక్షులు కాశన్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఫిజికల్ డైరెక్టర్ రాకేష్ శర్మ, ప్రధాన కార్యదర్శులుగా సాయిబాబా, మండల మహిళా అధ్యక్షురాలుగా శ్రీవాణి, మండల కన్వీనర్‌గా సురేష్‌లతో పాటు మరో పది మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ మురళీధర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగొద్దు



మాట్లాడుతున్న అధికారులు

మాగనూర్: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాలని ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అన్నారు. బుధవారం ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండలాల గ్రామ మంచి నీటి సహాయకులకు ఎంపీడీఓ సమావేశ మందిరంలో ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనింగ్‌లో మంచినీటి మోటార్ల రిపేరు, హ్యాండ్ పంప్, క్లోరినేషన్ టెస్ట్, పైప్‌లైన్ లీకేజీ రిపేర్ పై ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూఎస్ డిప్యూటీ అధికారి శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

కళాకారులకు మార్గదర్శకుడు ఎస్పీ బాలు



ఎస్పీ బాలుకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

నారాయణపేట రూరల్: నేటి కళాకారులకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మార్గదర్శకుడని బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని బాలకేంద్రంలో బుధవారం బాలు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్పీ బాలు ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు వసంత్ నాగరాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందు నామాజీ, టీడీపీ రాష్ట్ర నాయకులు ఓం ప్రకాష్, బలకేంద్రం సిబ్బంది సంగ నర్సింహులు, రామకృష్ణ కల్యాణి, ఉషారాణి, చంద్రకళ పాల్గొన్నారు.

బీజేపీ గ్రామ స్థాయిలో బలోపేతం కావాలి

మరికల్: గ్రామ స్థాయిల్లో బీజేపీని బలోపేతం చేయడం కోసం కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్ అన్నారు. పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, సభ్యత్వ నమోదు కన్వీనర్ వేణు, రాజేష్, రమేష్, మహేష్‌శెట్టి, చెన్నయ్య, నిఖిల్, వెంకటేష్, నరేష్, మహేష్, సురేష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మక్తల్: భూత్పూర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇన్‌చార్జి సత్యనారాయణరెడ్డిప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్, శేఖర్, లింగారెడ్డి, నర్సింహ, బాల్‌రాజు పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు.

కృష్ణా: గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేసినట్లు ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నర్సప్ప, రాఘవేంద్రలు తెలిపారు.

మాగనూర్: మండలంలోని మాగనూర్, వర్కూర్, కొత్తపల్లి గ్రామాలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



జిల్లా పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో దీన్‌దయాల్ జయంతి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాసులు, నాయకులు సత్య యాదవ్, రఘువీర్ యాదవ్, మదన్ పాల్గొన్నారు.

దన్వాడ: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాకం సురేందర్ ప్రారంభించారు.

మద్దూరు: దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.